దొంగలతో జాగ్రత్త

● జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: నగరంలో దొంగలు వివిధ కోణాలు వెతుక్కుని దొంగతనాలకు పాల్పడుతున్నారని జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన దొంగతనాల విధానాలను వివరించారు.

● నాలుగో తేదీన అనంత వీధిలో ఓ వృద్ధురాలు ఒక్కరే ఇంటి తలుపులు తెరుచుకొని టీవీ చూస్తూ వుంది. ఇదే సమయంలో ఇద్దరు ఆగంతకులు ఇంటి లోపలికి ప్రవేశించి నోరు మూసి ఒంటిపై ఉన్న బంగారు గాజులు, చైన్, ఉంగరాలు దొంగలించి, ఆమెను రూములో బంధించి పారిపోయారు.

● అదేవిధంగా ఈ నెల ఏడో తేదీన రాత్రి 7 గంటల సమయంలో ఓటేరులో కాపురం ఉంటున్న ఓ మహిళ తన ఇంట్లో చిన్నపిల్లలను ఉంచి ఇంటి తలుపులు తెరిచి పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లింది. అదే సమయంలో ఇద్దరు యువకులు ఇంటి వద్దకు వచ్చి చదువుకుంటున్న చిన్నపిల్లలతో మీకు మేం చదువు చెప్తామని, కావాలంటే స్కూల్ బ్యాగులు తెస్తామని వారితో చనువుగా ప్రవర్తించారు. ఆ పిల్లలు నమ్మించి మొహం కడుక్కోవడానికి బాత్రూం చూపించమని అడిగారు. అలా రూమ్ లోకి వెళ్లడంతో బీరువాకు తాళం ఉండడంతో అందులో ఉన్న 500 గ్రాములు బంగారం దోచుకుని పారిపోయారన్నారు. ఇలా జరుగుతున్న దొంగతనాలకు అరికట్టేందుకు ప్రజల సహకారం కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఊరికి వెళ్లే సమయంలో సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లో సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్(కెమెరాలను)ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా దీపావళి జరుపుకోవాలి

దీపావళి సందర్భంగా తిరుపతిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలను ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. దీపావళి పండుగను ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. పిల్లలు బాణసంచా కాల్చే సమయంలో ఇసుక, నీళ్లను తప్పనిసరిగా పక్కనే ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే 100కు సమాచారం అందించాలన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం ఉదయం జరిగిన పెద్ద శేష వాహన సేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఆచార్య సర్వోత్తమ రావు రచించిన శ్రీ తాళ్లపాక పదకవుల సంకీర్తనలు, డాక్టర్ గిరిధర్ బోరె రచించిన భగవద్గీత, కొలిచిన అద్వైత పరబ్రహ్మ శాస్త్రి రచించిన శ్రీవిద్యా విలాసం పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి డా.ఆకెళ్ల విభీషణ శర్మ, ఉపసంపాదకులు డా.నరసింహాచార్య, రచయితలు పాల్గొన్నారు.

14వ తేదీ డయల్ యువర్ డీఎం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ప్రభుత్వం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు నేతృత్వంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలిపిరి డిపో పరిధిలో సమస్యలు ఉంటే 99592 25671 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి


అబుల్ కలాంకు నివాళులర్పిస్తున్న కమిషనర్ హరిత తదితరులు

తిరుపతి తుడా: దేశంలో అందరికీ ఉన్నత విద్య అందించేందుకు పాటుపడిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు ఇమామ్, కార్పొరేటర్ నరేంద్ర, మున్సిపల్ ఉద్యోగులు ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్పొరేటర్ నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఆర్‌ఓ సేతుమాధవ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, మున్సిపల్ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులతో దీపావళి సంబరాలు


కార్మికులకు టపాసులు, సరుకులు అందజేస్తున్న రామస్వామి

తిరుపతి తుడా: 23వ డివిజన్ కార్పొరేటర్, మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రామస్వామి వెంకటేశ్వర్లు డివిజన్ పారిశుధ్య కార్మికులతో కలిసి శనివారం దీపావళి సంబరాలు నిర్వహించారు. దీపావళి సందర్భంగా కార్మికులకు టపాసులు, స్వీట్స్, ఫ్రూట్స్‌తో పాటు ప్రొవిజన్స్‌ను బహుమతిగా ఆయన అందజేశారు. వార్డు ప్రెసిడెంట్ కొల్లి రఘురామిరెడ్డి వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యదర్శి ద్వారక చౌదరి, బలరాం రెడ్డి, కన్వీనర్ రఘునందన్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కిషోర్, మన్సూర్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో దీపావళి రద్దీ

● అదనంగా 75 బస్సులు ఏర్పాటు


తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

తిరుపతి అర్బన్: దీపావళిని పురస్కరించుకుని ఆది, సోమవారాలు సెలవులు రావడంతో పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నవారంతా సొంత గ్రామాలకు బయల్దేరారు. ఈ నేపథ్యంలో తిరుపతి బస్టాండ్ ప్రయాణికులతో నిండిపోయింది. శనివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అవసరమైన మేరకు ఏర్పాట్లు చేపట్టారు. దీపావళి సందర్భంగా తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి అదనంగా 75 సర్వీసులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా తిరుపతి జిల్లాలో 11 డిపోల నుంచి అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా అన్ని బస్సులను ఏర్పాటు చేశారు. మరోవైపు రైల్వే స్టేషన్ సైతం ప్రయాణికులతో నిండిపోయింది. తిరుపతి రైల్వే స్టేషన్‌లోనూ మెరుగైన ఏర్పాట్లు ప్రయాణికులకు కల్పించారు.

దీపావళి ప్రజల్లో ఆనందాన్ని నింపాలి

● ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం


ఉద్యోగులు, సిబ్బందికి దుస్తులు, స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: దీపావళి పండుగ ప్రజల్లో ఆనందాన్ని, సంతోషాన్ని నింపాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ తిరిగి అధికారంలోకి వచ్చేలా ప్రజలు తోడ్పడాలని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో శనివారం రష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బందికి, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలకు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి దుస్తులు, స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వరప్రసాద్‌బాబు

తిరుపతి కల్చరల్: రేడియంట్ హాస్పిటల్ అధినేత డాక్టర్ దారరెడ్డి వరప్రసాద్ బాబు ఆధ్వర్యంలో శనివారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి 200 మంది పాల్గొని ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, ఊపిరితిత్తులకు సంబంధించిన పీఎఫ్‌టీ వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేడియంట్ హాస్పిటల్ సిబ్బంది, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడు శివసుబ్రమణ్యం ఆకస్మిక మృతి



శివసుబ్రమణ్యం (ఫైల్)

తిరుపతి కల్చరల్: రంగస్థల నటుడు శివసుబ్రమణ్యం(73) శనివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన రైల్వే మెయిల్ ఎక్స్‌ప్రెస్ గార్డ్‌గా పని చేస్తూ పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం రాయల్‌నగర్‌లో నివాసముంటున్న ఈయన రైల్వే గార్డ్‌గా మదనపల్లె, పాకాల, తిరుపతిలో పని చేసి ఇక్కడే పదవీ విరమణ పొందారు. అటు వృత్తిలో రాణిస్తూ ప్రవృత్తిగా నాటక రంగాన్ని ఎంచుకొని భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి ఏకపాత్రాభినయాలతోపాటు అనేక వేషాలు ధరించి అద్భుత నటనతో ప్రేక్షకుల ఆదరణ పొందారు. రావణ బ్రహ్మ పాత్రలో అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి పేరు తెచ్చుకోవడంతోపాటు అవార్డును అందుకున్నారు. నవ్య కళాసమితి స్థాపించి రైల్వే కళాకారులను మరింత ప్రోత్సహించి తద్వారా అనేక నాటకాలు ప్రదర్శింపజేశారు. రంగస్థల నటుడుగా ఆయన ఎనలేని అవార్డులు, పురస్కారాలు అందుకున్నారు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శివసుబ్రమణ్యం అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు మహేష్‌బాబు తెలిపారు. వీరి మృతిపై పలువురు కళాకారులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా శరత్‌కుమార్



శరత్‌కుమార్

తిరుపతి కల్చరల్: బీజేపీ యువమోర్చా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడిగా శరత్‌కుమార్‌ను నియమించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తనకు జిల్లా ఉపాధ్యక్షుడి బాధ్యతలు ఇచ్చిన బీజేవైఎం రాష్ట్ర నేతలకు ఈ సందర్భంగా శరత్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో బీజేవైఎం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేడే దీపావళి వెలుగుల సంబరం

- తిరునగరిలో దీపావళి సందడి
- గ్రీన్ టపాసుల కొనుగోలుకు మొగ్గు
- లక్ష్మీపూజకు సిద్ధమవుతున్న ప్రజలు
- స్వీట్లు కొనుగోళ్లతో జనం సందడి



దీపావళి వేడుకల కోసం దీపాలు కొనుగోలు చేస్తున్న మహిళ

తిరుపతి కల్చరల్: చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి జరుపుకుంటారు. ఈ పండుగను కుల, మతాలకు అతీతంగా భారతదేశమంతటా ప్రజలందరూ ప్రత్యేకంగా ఆందోత్సాహాలతో దీపావళి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. దీపావళి అంటే దీపాల వరుస(సమూహం)అని చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలి వెలుగు నింపడానికి సంకేతంగా ఈ పండుగ చేసుకుంటారు. వరుస దీపాలు వెలిగించి నిండైన వెలుగులతో పండుగ చేసుకుంటారు. ఆదివారం నాడు దీపావళి పండుగ కావడంతో ఆనందోత్సాహాలతో టపాకాయలు, బాణసంచా పేల్చి పండుగ సంబరాలు చేసుకునేందుకు సన్నద్ధమయ్యారు. దీపావళితో ప్రజలు ఉత్సాహంగా కొత్తదుస్తులు, టపాకాయలు, స్వీట్లు కొనుగోలుతో నగరంలో దీపావళి పండుగ సందడి కనిపించింది. దీంతో దీపావళికి ముందు రోజు కొత్త బట్టలు, స్వీట్లు, టపాకాయలు కొనుగోళ్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో నగరంలోని వస్త్ర దుకాణాలు, స్వీట్ల దుకాణాలు జనంతో కిక్కిరిశాయి. పూజా సామగ్రి కొనుగోలుతో నగరంలో జన సందడి నెలకొంది. గాంధీ రోడ్డు, ఆర్‌సీ రోడ్డు, బైరాగి పట్టెడ, అన్నారావు సర్కిల్, ఇందిరా కూరగాయల మార్కెట్, మంగళం రోడ్డు తదితర ప్రాంతాల్లోని పూజా సామగ్రి కొనుగోలు, బేకరీలు, స్వీట్ల దుకాణాల వద్దకు జనం ఎగబడ్డారు. బాణా సంచా కొనుగోళ్లతో టపాకాయల దుకాణాల్లో జన సందడి కనిపించింది. ప్రధానంగా గ్రీన్ టపాకాయలు కొనుగోళ్లకు జనం అధికంగా మొగ్గు చూపారు. ఈ ఏడాది అమావాస్య తిథి ఆదివారం మధ్యాహ్నం 1.51 గంటలకు ప్రారంభమై 13వ తేదీ సోమవారం మధ్యాహ్నం 2.20 గంటల వరకు ఉంటుంది. ఈ మేరకు ఆదివారం సాయంత్రం 5.25 గంటల నుంచి దీపావళి ధనలక్ష్మీ పూజలు చేసుకునేందుకు దివ్వెలు కొట్టుటకు శుభప్రదమని పండితులు చెబుతున్నారు. పండితుల సూచన మేరకు ఈ ఏడాది కేదారేశ్వర నోముల వ్రతాల నిర్వహణలో ప్రజలు కొంత సందిగ్ధంలో పడ్డారు. లక్ష్మీ పూజలు, దీపావళిని మాత్రం ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నంలోపు జరుపుకోవచ్చని పండితులు సూచిస్తున్నారు.







టపాకాయల దుకాణాల వద్ద సందడి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి రవణప్పగారిపల్లి వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పాకాల భారతంమిట్ట 8వ వీధికి చెందిన చంద్రమోహన్ తన మనవడు సోమశేఖర్ సాయితో కలసి టీవీఎస్–50 వాహనంలో చంద్రగిరి నుంచి పాకాలకు రాంగ్‌రూట్‌లో పయనమయ్యాడు. పనపాకం వద్ద వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొంది. ఆ వెనుకే వస్తున్న మరో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చంద్రమోహన్‌కు తీవ్ర గాయాలు కాగా, సోమశేఖర్ సాయి కుడికాలి తొడ భాగం వద్ద గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన చంద్రమోహన్

పవిత్రోత్సవాలకు పూర్ణాహుతి



శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన పవిత్రోత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, తోమాల, కొలువు నిర్వహించారు. యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా కుంభప్రోక్షణ, ఆచార్య బహుమానం అందజేశారు. ఈ కార్యక్రమంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, అర్చకులు శ్రీనివాసాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్ భౌతిక కాయానికి టీటీడీ చైర్మన్ భూమన నివాళి



నాగరాజుకు నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన

తిరుపతి కల్చరల్: అనారోగ్యంతో మృతి చెందిన గోపాల్ ఆటో మొబైల్స్ అధినేత దామా గోపాల్ భౌతిక కాయానికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శనివారం నివాళులర్పించారు. దామా గోపాల్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలాగే శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యురాలు కృష్ణవేణమ్మ భర్త నాగరాజు అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందారు. టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కృష్ణవేణమ్మ గృహానికి వెళ్లి ఆమె భర్త నాగరాజు భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు పంపిణీ



తిరుపతి కల్చరల్: ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ఆదేశాల మేరకు 15వ డివిజన్ కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. రాయలసీమ విద్యాసంస్థల అధినేత, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వై.ఆనంద్‌రెడ్డి చేతుల మీదుగా దీపావళి కానుకగా స్త్రీలకు చీరలు, కుంకుమ, గాజులు, పండ్లు, స్వీట్లు, పురుషులకు షర్టు, ప్యాంట్, స్వీట్లు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు అధ్యక్షుడు శ్రీనివాసులు, కన్వీనర్ ప్రేమ్‌కుమార్, రాజా, రాధ, ఇందు పాల్గొన్నారు.

సినీ నటుడు చంద్రమోహన్‌కు రంగస్థలి నివాళి



నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతికి రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళులర్పించారు. రంగస్థలి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు చిత్రసీమలో సినీ హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా అనేక సినిమాల్లో నటించి తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన చంద్రమోహన్ అనారోగ్యంతో మృతి చెందడం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు. 1966లో చంద్రమోహన్ రంగులరాట్నం సినిమా ద్వారా సినీ రంగ ప్రవేశం చేసి మొదటి సినిమాతోనే నంది అవార్డును గెలుపొందారని గుర్తు చేశారు. అటు తర్వాత అనేక సినిమాల్లో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు ప్రజలను తన నటనతో మెప్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్, కళాకారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 56,978 మంది స్వామివారిని దర్శించుకోగా 19,617 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.87 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాలగిరి ప్రతాప్ రెడ్డి, దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, తమ్ముడు గణేష్

తిరుపతి మంగళం: రాష్ట్రంలో తిరిగి జగనన్న సీఎంగా అధికారులు ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తిరుపతి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి మూడో డివిజన్లో కార్పొరేటర్ తమ్ముడు గణేష్ ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న, ఆంధ్రప్రదేశ్కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తిరిగి జగనన్న అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు వెంకటేశ్వర రావు రాయల్, 13వ వార్డు కార్పొరేటర్ కోటూరు ఆంజనేయులు, తాళ్లూరు ప్రసాద్, దూది శివ, వార్డు నాయకులు సుబ్రమణ్యం మేస్త్రి, కుమార్, దామోదర్ రెడ్డి, రఘునాథ్ రెడ్డి, రమేష్, ప్రభాకర్ రెడ్డి, పాండు, రాజేష్, యమునారాణి, ప్రభాకర్, బాషా, పవన్, రంగయ్య, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మాధవ నాయుడు, గోవింద్ రెడ్డి, వలంటీర్స్, గృహ సారథులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

శ్రీపరాశరేశ్వర ఆలయ అభివృద్ధికి సహకారం



అభివృద్ధిపై చర్చిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): యోగిమల్లవరంలో వెలసిన శ్రీకామాక్షమ్మ సమేత పరాశరేశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని విధాలుగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి కోరిక మేరకు ఆలయంలో పలు సుందరీకరణ కార్యక్రమాలను చర్చించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ కామాక్షమ్మ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయానికి కల్యాణోత్సవ మండపం, భక్తులు ఎండకు వానకు ఇబ్బంది పడకుండా ఆలయ ప్రదక్షిణ చేసే పరిసరాలను అభివృద్ధి చేయడానికి, క్యూలైన్లను అభివృద్ధి చేయడానికి సుముఖత వ్యక్తం చేశారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెంటనే స్పందించడంతో తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి హంస వాహన సేవలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి, తిరుచానూరులో అత్యంత సుందరంగా ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేసినట్లు చెప్పారు. భారతీయ సమాజం, సంస్కృతి, ఆచార వ్యవహారాలలో స్త్రీకి ప్రథమ స్థానం ఉందన్నారు. తిరుచానూరులో మాత్రమే అమ్మవారు మాడవీధుల్లో వివిధ అలంకారాలలో విహరించి భక్తులను కటాక్షిస్తారన్నారు. నవంబర్ 14వ తేదీ అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గజవాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం టీటీడీ రూ.9.5 కోట్లతో పద్మ సరోవరంను అభివృద్ధి చేసిందన్నారు. నవంబర్ 18వ తేదీన పంచమి తీర్థం సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుండి విచ్చేసే లక్షలాదిమంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కరుణాకరరెడ్డి పేర్కొన్నారు.


హంస వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

వాహన సేవలో కళాబృందాల ప్రదర్శన

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన శనివారం ఉదయం పెద్దశేష వాహనసేవ, రాత్రి హంసవాహన సేవలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాబృందాలు అద్భుత ప్రదర్శనలిచ్చాయి. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 13 కళా బృందాలు, 320 మంది కళాకారులు పాల్గొని తమ సంగీత నృత్య ప్రదర్శనలతో భక్తులను పరవశింప చేశారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ విఎస్ఆర్ఎస్ నాట్యాలయానికి చెందిన 20 మంది కళాకారుల బృందం ప్రదర్శించిన అన్నమయ్య సంకీర్తనలకు భరతనాట్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. కేరళ రాష్ట్రం పాలక్కడ్‌కు చెందిన 16 మంది మహిళల బృందం చండి మేళం ప్రదర్శన కనువిందు చేసింది. అనంతపురం శ్రీకృష్ణ నాట్యాలయంకు చెందిన 20 మంది యువతులు ఓణి నృత్య రూపకం, గౌరీపట్నం చెందిన సురేష్ బృందం కలశం డాన్స్ నేత్రపర్వంగా సాగింది. తమిళనాడుకు చెందిన భరతకళా అకాడమీ కళాకారులు మహాలక్ష్మి అష్టాంగం, చెన్నైకి చెందిన రాగిణి సంగీత నృత్యాలయం కళాకారులు ఖడిగ నృత్యం కనువిందు చేసింది. తిరుపతి ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు పెద్ద శేష వాహనంలో శ్రీ పద్మావతి అమ్మవారి నృత్య రూపకాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. రాజమండ్రికి చెందిన పార్వతీ బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.


హంస వాహన సేవ ముందు కళాకారుల నాట్యం


వాహన సేవ ముందు శ్రీకృష్ణుడి వేషధారి


అలరించిన నాట్య కళా ప్రదర్శన

క్లుప్తంగా

సీఎం జగనన్న పాలనలో.. ప్రజల జీవితాల్లో వెలుగులు


చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: సీఎం జగనన్న పాలనలో ప్రజల జీవితాల్లో మరెన్నో దీపావళి వెలుగులు విరజిమ్ముతాయని తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి చీకటిపై వెలుగు.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే పర్వదినంగా అభివర్ణించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. 2024 ఏడాదిలో చంద్రగిరి ఎమ్మెల్యేగా మరింత గొప్పగా దీపావళి జరుపుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు సకల సంపదలు, సంతోషాలతో ఉండాలని, వారి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు.

ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆయుధ పూజ



బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శనివారం ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి ఆధ్వర్యంలో ఆయుధ పూజ ఘనంగా జరిగింది. కార్యాలయంలోని దేవుళ్ల పటాలకు పూజారితో ప్రత్యేక అర్చనలు చేయించారు. సబ్‌స్టేషన్‌లోని వివిధ రకాల వస్తువులకు, ట్రాన్స్‌ఫార్మర్లకు, వాహనాలకు పూజలు చేశారు. మండలంలో ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోకుండా ఉండాలని పూజలు చేసినట్లు ఏఈ తెలిపారు. లైన్‌మెన్ మున స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మి వేడుకలు


ప్రార్థనలో మతపెద్దలు, ముస్లింలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీ తిరుపతి–శ్రీకాళహస్తి జాతీయ రహదారి పక్కన ఉన్న సయ్యద్ మౌలాలి దర్గా వద్ద శనివారం గ్యార్మి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు సయ్యద్ అరిఫుల్లా సాహెబ్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫకీర్ల గంధ మహోత్సవం నిర్వహించారు. జెండా ఊరేగింపు జరిగింది. గంధాన్ని జెండా వద్ద ఉంచి మతపెద్ద షేక్ మీర్జాసాహెబ్ పూజలు చేశారు. గంధాన్ని భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మతపెద్దలు జనాబ్‌జుబేర్ హయత్ ఖాద్రి, మహ్మద్ అవేజ్, అబుల్ ఫైజ్, అలీకౌసర్, అలీఖుస్రో పాల్గొన్నారు.

మాలధారణం.. నియమాల తోరణం


అయ్యప్ప భజన చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని నరసింహులు స్వామి ఇంట్లో శనివారం అయ్యప్ప మాలధారణ భక్తులు పడిపూజను ఘనంగా నిర్వహించారు. కాంపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు, కుక్కంబాకం, గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారణ భక్తులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అరటి చెట్టుతో 18 మెట్లను ఏర్పాటు చేశారు. అయ్యప్ప విగ్రహానికి విభూది, పంచామృత అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు. స్వాములు భక్తి గీతాలు ఆలపించారు. అయ్యప్ప భజన చేశారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సమీపంలో పెద్ద పాండూరుకు వెళ్లే మార్గంలోని శ్రీఅంజనేయస్వామి విగ్రహ కూడలి వద్ద తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి నిధులతో నూతనంగా బస్ షెల్టర్‌ను నిర్మించారు. రూ.5లక్షల వ్యయంతో దీన్ని నిర్మించారు. ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఈ బస్ షెల్టర్ పెద్ద పాండూరు పరిసర ప్రాంతాల్లోని 10 గ్రామాల ప్రజలకు ఉపయోగపడనుంది. ఆ ప్రాంత ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అంజనేయస్వామి విగ్రహ కూడలి వద్ద బస్సు ఎక్కాల్సి ఉంది. ఊరి బయట ఉన్న ఈ కూడలిలో వర్షాకాలమొస్తే బస్సు దిగి నా, వెళ్లాల్సి ఉన్నా ఇబ్బందిపడేవారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ద్వారా స్థానిక ప్రజలు సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన ఎంపీ పార్లమెంట్ నిధుల ద్వారా బస్ షెల్టర్ నిర్మాణంకు రూ. 5లక్షలు మంజూరు చేశారు.

సయ్యద్ ఖాద్రికి వైఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

తిరుపతి కల్చరల్: మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్ జయంతిని పురస్కరించుకొని తిరుపతికి చెందిన వైఎస్ఆర్ సీపీ మైనారిటీ నేత, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రికి ప్రభుత్వ వైఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. 2017లో రాష్ట్రంలోని ఎస్వీ యూనివర్సిటీ, ఆంధ్ర యూనివర్సిటీలో ఉర్దూ విభాగాలను జీవో 29/30ల ద్వారా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రద్దు చేశారు. దీంతో సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి ఉర్దూ విభాగాల రద్దుపై హైకోర్టుకు వెళ్లి ఆ విభాగాల పునరుద్ధరణకు విశేష స్థాయిలో పోరాటం సాగించారు. 2019లో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జీవో 29/30లను రద్దు చేసి, ఉర్దూ విభాగాలను పునరుద్ధరించారు. ఉర్దూ భాషకు సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని వైఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డులు ప్రదానం చేసింది. ఈ మేరకు శనివారం విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి వైఎస్ఆర్ ఎక్స్‌లెన్స్ అవార్డులను అందుకున్నారు. అలాగే ఎస్వీ యూనివర్సిటీ ఉర్దూ విభాగం గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న పీలేరుకు చెందిన అంజాద్ ఆలీ ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన ఉర్దూ భాషలో బోధన, పరిశోధనకు చేసిన కృషిని గుర్తించి ఏపీ ఉర్దూ అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. ఈ మేరకు శనివారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.

తొలగించిన క్షురకులను విధుల్లోకి తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

తిరుపతి కల్చరల్: తిరుమల కల్యాణ కట్టలో తొలగించిన క్షురకులను విధుల్లోకి తీసుకోవాలని, కేవోడీ పద్ధతిని రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శ్రీవారి కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఉపాధ్యక్షుడు వి.నాగరాజు, శ్రీవారి కల్యాణ కట్ట నాయీ బ్రాహ్మణ సంఘం కార్యదర్శి ప్రసాద్, మహిళా క్షురకుల సంఘ నేత రాధాదేవి, ఏపీ క్షౌర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగులప్ప పాల్గొని ప్రసంగించారు.

తిరుపతిలో చెడ్డీ గ్యాంగ్

- నగర,శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం
- ప్రజలకు పోలీసు వారి హెచ్చరిక

తిరుపతి క్రైం: తిరుపతి నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యంత క్రూరమైన చెడ్డీ గ్యాంగ్ దొంగలు సంచరిస్తున్నట్లు కొన్ని ఆనవాళ్లతో పాటు సమాచారం పోలీస్ శాఖకు ఉంది. నగరంలో పాటు నగర శివారులో నివాసం ఉంటున్న ప్రజలు రాత్రిపూట అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయంలో ఇంటి తలుపులు తట్టినా, కాలింగ్ బెల్ కొట్టినా వేరే రకమైన శబ్దాలు చేస్తూ ప్రమాదం ఉందని అరిచినా.. ఎవరో నిర్ధారించుకోకుండా తలుపులు తీయరాదని సూచించారు. అనుమానిత వ్యక్తులు తారసపడినా, అనుమానం కలిగే విధంగా ప్రవర్తించినా వెంటనే డైల్ 100 లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్ కి సమాచారం అందించాలని తెలియజేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు బృందాలు దొంగలను పట్టుకోవడానికి తీవ్రమైన కృషిచేస్తున్నాయి.

వారపు సంతలో రైతులకు భోజనాలు


భోజనాలు వడ్డిస్తున్న వైఎస్ఆర్ సీపీ నాయకులు

పాకాల: మండలంలోని దామలచెరువు సచివాలయం వద్ద నిర్వహిస్తున్న వారపు సంతలో చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, చంద్రగిరి వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉచితంగా భోజనాలను అందజేశారు. శనివారం స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఆకలితో ఉండకూడదని, సంతకు వచ్చే సన్న, చిన్నకారు రైతులు, వ్యాపారస్తులకు సమయానికి భోజనం అందేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాకాల మండలంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు ఏదో ఒక సహాయం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబం బాగుండాలని, అన్ని సమయాల్లో ఎమ్మెల్యే కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సునీత, నాయకులు రహీం, రఘుపతి, ఇమ్రాన్, హరిప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి రజక సంఘం నాయకులు


వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన రజక సంఘం నాయకులు చెంబేటి సురేష్, చెంబేటి బాలాజీ తమ అనుచరులతో కలిసి వైఎస్సార్ సీపీలో చేరారు. శనివారం వార్డు పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రజకుల కోసం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై, ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. డిష్ ధర్మయ్య, కంచిగురవయ్య, చిర్రి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ఏర్పేడు: తిరుపతి రూరల్ మండలం, రామాపురం గ్రామానికి చెందిన సమీరా జన్మదినం సందర్భంగా చిందేపల్లె ఎస్టీ కాలనీలో విద్యార్థులకు యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యా సామగ్రి, భోజనం ప్యాకెట్లు అందజేశారు.

దీపావళికి ముస్తాబవుతున్న కోన

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆదివారం జరగనున్న దీపా వళి పండుగకు ముస్తాబవుతోంది. దీపావళి సందర్భంగా రథోత్సవం, నరకాసుర వధ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందుకోసం నరకాసుని బొమ్మను తయారు చేస్తున్నారు. ఉదయం స్నపన తిరుమజనం నిర్వహిస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటలకు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి దేవతల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణుడు, రుక్మిణీదేవి,సత్యభామగా అలంకరించి రథోత్సవం, నరకాసుర వధ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. అలాగే ఆదివారం స్వాతి స్వామివారి జన్మనక్షత్రం కావడంతో చందనాలంకరణ, ప్రత్యేక పూజలు,హోమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రంజింపజేసిన వీణానాదం

సత్యవేడు: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం నిర్వహించిన శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, వీణానాదం భక్తులను అలరించాయి. సూళ్లూరుపేట గాయత్రీ నగర్‌కు చెందిన మహిళ భక్త బృందం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం చేసి, పారాయణంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వాకచర్ల సుష్మ వీణా నాద కచేరీ భక్తులను కట్టిపడేసింది. హంసధ్వని రాగంలో 'శక్తి సహిత గణపతి' కీర్తనతో ప్రారంభించి, శ్రీరాగంలోని అంబా పరమేశ్వరి, పాడి రాగంలో అన్నమాచార్యుల 'చక్కని తల్లికి', యమునా కల్యాణి రాగంలో భారతీ తీర్థ మహాస్వామి వారి 'గరుడగమన తవ' తదితర పలు కీర్తనలను వీనుల విందుగా వీణపై పలికించింది. శ్రీసిటీ ఉద్యోగులు, శ్రీసిటీ పరిధిలోని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థ, అన్న ప్రసాదాలు అందజేశారు.


వీణానాద కచేరీ చేస్తున్న సుష్మ

పండుగలా వ్యవసాయం

- 5వ ఏడాది 2విడత రైతు భరోసా నిధుల విడుదల
- నియోజకవర్గంలో 33,944 మందికి పెట్టుబడి సాయం
- రూ. 13.78 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం పండుగలా మారింది. దండగ అన్న టీడీపీ నేతల నోళ్లు మూతపడ్డాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న పథకాలు రైతుల ఇంట కాంతులు నింపుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలో ఐదో ఏడాది రెండవ విడత రైతు భరోసా సాయం 33,944 మందికి రూ. 4వేలు చొప్పున జమ కావడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వరదయ్యపాళెం: పంటల సాగుకు పెట్టుబడి సాయం అందుతుండడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్ల ఆరంభంలోనే రైతు భరోసా నిధులు మంజూరు చేయడంతో పెట్టుబడులకు ఉపశమనం లభిస్తోంది. ఈనెల 7న ఐదో ఏడాది రెండవ విడత రైతు భరోసా సాయం ప్రభుత్వం విడుదల చేసింది. నియోజకవర్గంలో మొత్తం 33,944 మంది రైతులకు పెట్టుబడి సాయం గానూ 13.78కోట్లు నగదు మంజూరైంది. ఒక్కో రైతు ఖాతాలో రూ.4వేలు జమ అయ్యింది.


వరదయ్యపాళెం: లబ్ధిదారుల జాబితా పరిశీలిస్తున్న ఏఓ సుహార్ లత

కౌలు రైతులకు అండ

భూ యాజమాన్య రైతులకే కాకుండా ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం యాజమాన్య రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నిధులు మంజూరు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తోంది. నియోజకవర్గంలో 280 మంది కౌలు రైతులకు రూ. 32.20లక్షలు మంజూరైంది. అలాగే దేవదాయశాఖ భూములను కౌలుకు చేస్తున్న 22 మందికి రూ. 88వేలు విడుదలయ్యాయి. సకాలంలో పెట్టుబడి సాయం అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో రైతు భరోసా సాయం వివరాలు

మండలం	రైతులు	కౌలు రైతులు	దేవదాయ కౌలు రైతులు	రుణ సాయం రూ. కోట్లలో
సత్యవేడు	3888	37	0	1.59
వరదయ్యపాళెం	5100	58	0	2.10
నాగలాపురం	4334	25	0	1.76
నారాయణవనం	3390	114	21	1.49
పిచ్చాటూరు	3704	27	0	1.51
కేవీబీపురం	7894	1	1	3.15
బీఎన్‌కండ్రిగ	5332	18	0	2.15
మొత్తం	33944	280	22	13.78

పెట్టుబడులకు ఆసరా



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా రబీ, ఖరీఫ్ సీజన్లలో పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయడం సంతోషకరం. గతంలో పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. సీఎం జగనన్న చేస్తున్న మేలు మరువలేం. నాకు నాలుగు విడతల రైతు భరోసా నిధులు రూ. 54వేలు అందాయి. ప్రస్తుతం రూ. 4వేల నగదు ఖాతాలో జమైనట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది.

–మనోహర్, రైతు, చిలమత్తూరు

సంతోషంగా ఉంది



రైతుల కష్టాలను తెలిసిన నాయకుడు సీఎం కావడం అదృష్టం. రైతుల గురించి గతంలో ఏ పాలకులు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక రైతుల కోసం సంక్షేమ పథకాలు, సబ్సిడీ పరికరాలు, యంత్రాలు అందించారు. అలాగే మాట తప్పకుండా పెట్టుబడి సాయం అందించి రైతుల కష్టాలు తీరుస్తున్నారు. ఇలాంటి నాయకుడు సీఎం కావడం రైతుల అదృష్టం.

–మురళి, రైతు, వెంగారెడ్డికండ్రిగ

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


దామలచెరువులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గాయపడిన యువకులు

పాకాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి మండలంలోని శంఖంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. శనివారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బైనపల్లి గ్రామానికి చెందిన కిషోర్(21) శుక్రవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో శంఖంపల్లి వద్ద పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై తిరుపతి వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ


భాస్కర్‌రెడ్డి (ఫైల్)

మండలంలోని దామలచెరువుకు సమీపంలోని పత్తిపాటివారిపల్లి వద్ద చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఐరాల మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి(70) అక్కడికక్కడే మృతి చెందాడు. పనిపై భాస్కర్‌రెడ్డి పీలేరుకు వెళ్లి తిరిగి ఇంటికి బయల్దేరాడు. చిత్తూరు నుంచి పీలేరు వైపు మంగళంపేట సమీపంలోని నన్నూరివారిపల్లి గ్రామానికి చెందిన యువకుల ద్విచక్ర వాహనం ఎదురుగా వస్తున్న భాస్కర్‌రెడ్డి వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.